క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



బావిలో గంబూషియా చేప పిల్లలను విడిచి పెడుతున్న మలేరియా విభాగం సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ వైద్య ఆరోగ్య విభాగం అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దోమల సంతతి పెరగకుండా నీటిలో వాటి నిరోధకాలను విడిచిపెడుతున్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులకు కారణమవుతున్న దోమలను నివారించడానికి జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలో సోమవారం మలేరియా విభాగం సిబ్బంది బావుల్లో గంబూషియా చేప పిల్లల్ని విడిచిపెట్టారు. అనంతరం స్థానికులకు మలేరియా, డెంగ్యూపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, సిబ్బంది వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పైపులైన్ లీక్.. తాగునీరు వృథా



పైపులైన్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ రోడ్డులో పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. రెండు రోజులుగా పైపులైన్ లీకవుతున్నా మరమ్మతులు చేయడానికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది స్పందించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న ఆటో స్టాండ్‌కు ఎదురుగా పైపులైన్ దెబ్బతింది. తక్షణమే మరమ్మతులు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సోమవారం సంత వెలవెల



దుకాణాలు, జనం లేక బోసిపోయిన పిఠాపురం కాలనీ సంత

మద్దిలపాలెం: ప్రతి వారం జనాలతో కిటకిటలాడే ఈ వారపు సంత ఈ వారం వెలవెలబోయింది. భారీ వర్షాల కారణంగా జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో జరిగిన సోమవారం సంత జనాలు లేక బోసిపోయింది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా చిరు వ్యాపారులు సైతం సంతకు రాలేదు. దీంతో దుకాణాలు అక్కడక్కడ దర్శనమిచ్చాయి.

'స్పందన'కు 20 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్ కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తులు సమర్పించారు. కార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం తెచ్చిన కష్టాలు



మద్దిలపాలెం కూడలిలో కురుస్తున్న వాన



కైలాసగిరి కాలనీలో కూలిపోయిన రోడ్డు

ఆరిలోవ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు జనం నానా అవస్థలు పడ్డారు. జీవీఎంసీ 9వ వార్డు కైలాసగిరి కాలనీ కొండవాలులో సీసీ రోడ్డు కూలిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతమైన కైలాసగిరి కాలనీలో రక్షణ గోడ లేని రోడ్డు భాగం నానిపోయింది. దీంతో పాటు ఈ రోడ్డు పైభాగంలో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఆ నిర్మాణ సామగ్రి, యంత్రాలను రోడ్డుపై ఉంచడంతో ఆ బరువుకు నానిపోయిన రోడ్డు కిందకు జారిపోయింది. కిందన ఎలాంటి నివాసాలు లేకుండా ఖాళీ స్థలం ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మద్దిలపాలెం : రోజంతా జోరువానతో జనం ఇబ్బందులు పడ్డారు. స్కూళ్లు, కళాశాలల నుంచి విద్యార్థులు, కార్యాలయాల నుంచి ఉద్యోగులు తిరిగి ఇళ్లకు వెళ్తున్న తరుణంలో సాయంత్రం భారీ వర్షం కురవడంతో తడిసిముద్దయ్యారు. రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. కాలువల్లో చెత్త రోడ్ల పైకి కొట్టుకురావడంతో అస్తవ్యస్తంగా మారింది.

ఎక్కడి నీరు అక్కడే!

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–10లోని గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేక రహదారులు నీటమునిగాయి. సోమవారం కురిసిన వర్షానికి ఎంవీపీ కాలనీ సెక్టార్–9, 10లోని పలు వీధులు నీటితో నిండిపోయాయి. స్థానికంగా మురుగు నీటి ప్రవాహానికి అనుగుణంగా గెడ్డ ఉన్నప్పటికీ అందులో పూడిక పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు సైతం పెరిగిపోయాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్యాణ్ స్పందించి జీవీఎంసీ శానిటేషన్ సిబ్బందికి గెడ్డలో పూడిక పరిస్థితిని వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తరితగతిన పరిష్కారం చూపాలని కోరారు.



ఎంవీపీలోని ఓ వీధిలో నిలిచిపోయిన వర్షపునీరు

లారీ ఢీకొని ఒరిగిన చెట్టు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు టీఐసీ పాయింట్ వద్ద రోడ్డు పక్కన చెట్టును ఓ లారీ ఢీకొట్టింది. దీంతో ఆ చెట్టు రోడ్డుపై ఒరిగిపోయింది. సిమెంట్ లోడుతో దుర్గాబజార్ నుంచి బాలాజీనగర్ వైపు వెళ్తున్న లారీ పైభాగం ఇక్కడ తురాయి చెట్టు కొమ్మలకు తగిలింది. లారీ ఆగకుండా ముందుకు సాగడంతో చెట్టు వేళ్లతో సహా ఒరిగిపోయింది. చెట్టు ఒరిగిపోయి కొమ్మలు రోడ్డుమీద వేలాడుతుండడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. అలాగే విద్యుత్ స్తంభానికి ఉన్న కనెక్షన్లు తెగిపోయాయి. దీంతో చుట్టుపక్కల నివాసాలు, షాపులకు సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒరిగిన ఈ చెట్టు ఎప్పుడు పూర్తిగా కూలిపోతుందోనని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చెట్టును పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.



టీఐసీ పాయింట్ వద్ద రోడ్డు పక్కన చెట్టును ఢీకొని వెళ్లిపోతున్న లారీ

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



బస్సులో జీవీఎంసీకి చేరుకున్న మేయర్ గొలగాని



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించి క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వచ్చారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారి సిబ్బందితో వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని కోరారు.

3న జోన్–3లో బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఆగస్టు 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆశీలుమెట్ట జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ దొండపర్తి కల్యాణ మండపం, డైమండ్ పార్కు వాణిజ్య సముదాయంలోని మొదటి అంతస్తులో గల దుకాణాల నంబర్లు 8, 9, ఆశీలుమెట్ట వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3, ఎంవీపీ వాణిజ్య సముదాయంలోని 7, 10, 13, 14 నంబరు దుకాణాలు, జగ్గారావు బ్రిడ్జి వద్ద వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబరు 6(పీహెచ్ కోటా), సీతమ్మధార పాత వాణిజ్య సముదాయంలోని 15 నంబర్ దుకాణం(ఎస్సీ)కు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంలో పాల్గొనాలని జెడ్సీ కోరారు. వివరాలకు జీవీఎంసీ జోన్–3 కార్యాలయ పనివేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని చెప్పారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



893వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కార్మిక సంక్షేమానికి చేటు అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 893వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడితే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తొలేళ్ల ఉత్సవం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల పండగ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వీధుల్లో పూలఘటాలు తిరిగాయి. సాయంత్రం బంగారమ్మకు సారె సమర్పించారు. రాత్రి 7 గంటలకు వీధుల్లో కూటి ఘటాలు తిప్పారు. కళావేదిక ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన పండగ, అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పూల ఘటాలు, కూటిఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. అనుపు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ప్రభల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.



వీధుల్లో పూలజంగిడి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. మ్యాన్‌హోల్ రోడ్డు కన్నా కిందకి ఉండడంతో పాటు, దానిపై మూత పగిలిపోయింది. దీంతో వాహనచోదకులు తరచూ ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నెల 23న జీవీఎంసీ యూజీడీ విభాగ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం కురిసిన వర్షానికి మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాలతో పాటు, మురుగునీరు పొంగి పొర్లడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేయాలి.

– మద్దాల శ్రీనివాస్, పాత వెంకోజీపాలెం



పాత వెంకోజీపాలెంలో మ్యాన్‌హోల్ దుస్థితి

పారిశుధ్య కార్మికులకు సలాం..



వ్యర్థాలతో నిండిన ప్రాంతం



వ్యర్థాలు తొలగించిన తరువాత ఇలా..

ఏయూ క్యాంపస్: పారిశుధ్య కార్మికుల ఉత్తమ సేవలకు నిదర్శనంగా ఈ చిత్రాలు నిలుస్తున్నాయి. పెదవాల్తేరు నుంచి శివాజీపాలెం వెళ్లే మార్గంలో రామలక్ష్మి అపార్ట్‌మెంట్ చేరువలో ఉన్న డస్ట్‌బిన్‌ల ప్రాంతంలో తరచూ భారీగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు స్పందించి వ్యర్థాలు తొలగిస్తున్నా మళ్లీ షరామామూలుగానే దర్శనమిస్తోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యర్థాలు తొలగించడం పారిశుధ్య సిబ్బందికి సైతం ఇబ్బందికరంగా మారింది. అయినప్పటికీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం పారిశుధ్య సిబ్బంది తొలగించి, తరలించడంతో ఆ ప్రాంతం పరిశుభ్రంగా దర్శనమిచ్చింది.

నేడు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన



చల్లపల్లి శ్రావణి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రవాస భారతీయురాలు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలిపారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో స్థిరపడిన శ్రావణి చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారన్నారు. డీసీఎంఎస్ విభాగంలో ఉదయం 11 నుంచి రెండు గంటల పాటు శ్రావణి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. నృత్య కళాకారిణి శ్రావణి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఏయూలో నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. గణేష పంచరత్నం, కామాక్షి స్తుతి, బ్రహ్మకడిగిన పాదం, శివతాండవ స్తోత్రం, జావళి ప్రదర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య సి.ఎస్.రావు, విజయవేణి, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్, తదితరులు

ఏయూ క్యాంపస్: సంస్థలో వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకంగా నిలుస్తాయని డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్(హెచ్‌ఆర్) కె.ఎస్.వరప్రసాద్ అన్నారు. సోమవారం ఐఐఎం విశాఖపట్నం ఏయూ ప్రాంగణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు 'ప్రాజెక్ట్ అన్‌సెర్టెనిటీ–రిస్క్ మేనేజ్‌మెంట్ అంశంపై'ఐదు రోజుల పాటు జరిగే సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాజెక్టుల నిర్వహణ, పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. విభిన్న సంస్థలు, విభాగాలతో అనుసంధానంగా పని చేయడం, మానవ వనరుల సమర్థ నిర్వహణను వివరించారు. భవిష్యత్తులో ఆటోమేషన్ ఏఐ సాంకేతికతలు ప్రముఖ భూమిక పోషిస్తాయని, సాంకేతికత విస్తృతిని ముమ్మందుగా అంచనా వేస్తూ సాగాలన్నారు. అదే విధంగా ఎస్ఏడీకి చెందిన ఐఎన్‌ఏఎస్ అధికారులకు ఆరు రోజుల ఇండక్షన్ ప్రోగ్రాంని ప్రారంభించారు. ఆచార్య బి.శ్రీరంగాచార్యులు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రోహిత్ తిత్యాల్, ఆచార్య బాలాజి సుబ్రహ్మణియన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి



వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవీపీ గ్రంథాలయ ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: గ్రంథాలయాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి కార్యక్రమం ఎంవీపీ కాలనీలోని గ్రంథాలయంలో సోమవారం జరిగింది. ఆయన చిత్ర పటానికి గ్రంథాలయ ఉద్యోగులు, విద్యార్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాల కిందటే వెంకటరమణయ్య గ్రంథాలయాల విశిష్టతను గుర్తించారన్నారు. ప్రజలకు విజ్ఞానాన్ని అందించే వారధులుగా గ్రంథాలయాలు నిలుస్తాయని భావించారన్నారు. 1934–48 మధ్య రాష్ట్రంలో వందలాది గ్రంథాలయాలు ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది సుభాషిని, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో స్పెషలిస్ట్ సేవలు



ఇసుకతోటలో గల పట్టణ వైద్య ఆరోగ్య కేంద్రం

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో రెగ్యులర్‌గా ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సాధారణ ఓపీ సేవలు రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందిస్తున్నారు. స్పెషలిస్ట్ ఓపీ సేవలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ లభిస్తున్నాయి.

సోమవారం : చిన్న పిల్లలకు సంబంధించిన వైద్య సేవలు(పీడియాట్రిక్), ఎముకల వైద్య సేవలు(ఆర్థో) అందుబాటులో ఉన్నాయి.

మంగళవారం : చర్మ వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు సేవలందిస్తున్నారు.

బుధవారం : ప్రసూతి వైద్య సేవలు(గైనికాలజీ), ఈఎన్‌టీ సమస్యలకు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటున్నారు.

గురువారం : చిన్న పిల్లలు, సాధారణ వైద్య నిపుణులు(జనరల్ మెడిసిన్), పల్మనాలజీ వైద్యులు సేవలు అందిస్తారు.

శుక్రవారం: ఎముకుల వైద్య సేవలు, చర్మ వ్యాధులు, సాధారణ శస్త్రచికిత్సలు సేవలు

శనివారం: వృద్ధులకు సంబంధించిన వైద్య సేవలు(జెరియాట్రిక్స్) అందుబాటులో ఉంటాయి. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూపీహెచ్‌సీ సిబ్బంది కోరారు.

సమస్యలు పరిష్కరించాలని పోర్టు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించా రు. నాయకులు ఎం.పైడిరాజు, కొండయ్య, మహ్మద్ నజీర్, దుమ్మెట అప్పారావు, శీత మదన్, సోడదాసు సుధాకర్ పాల్గొన్నారు.

'మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలి'

సీతమ్మధార: మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల నుంచి ఎల్ఐసీ భవనం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ హింసాకాండపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప, ప్రధాని మోదీ మౌనం వీడకపోవడంపై అనుమానాలు వస్తున్నాయన్నారు. నేరస్తులను శిక్షించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పేంత వరకు వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ఎ.విమల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, శేఖర్, సింహాచలం, ఎం.ఎ.బేగం, పద్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెంకటరావు

కొమ్మాది: రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సు, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ ఛాలెంజర్స్ అండ్ టెండర్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 5 రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటరావు ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.